క్లుప్తంగా

పోషకాహారం తీసుకోవాలి

నిజామాబాద్ రూరల్: విద్యార్థులు పోషకాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ వైద్యులు భాస్కర్ విద్యార్థులకు సూచించారు. గూపన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది వనజ, సుహాసిని, ప్రధానోపాధ్యాయులు శకుంతలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ ఎన్నిక



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్‌గా ఎం. రాంచందర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 7న సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్ వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ కుమ్మరి చిన్న గంగారాంను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. అనంతరం రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. 13 మంది డైరెక్టర్లకు గానూ 11 మంది సమావేశానికి హాజరయ్యారు. కేవలం ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. యానంపల్లి గ్రామానికి చెందిన ఎం.రాంచందర్‌గౌడ్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి సత్యనారాయణ ప్రకటించారు. అనంతరం ఆయనకు నియామక పత్రం అందజేశారు.

ఒత్తిడిని అధిగమించాలి



ధర్పల్లి: విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రొఫెసర్ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని హంస వాహిని పాఠశాలలో మంగళవారం విద్యార్థులను ఉద్దేశించి ఇన్నాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకొని చదువుతే మంచి మార్కులు సాధించవచ్చని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పురుషోత్తం, పాఠశాల హెచ్‌ఎం చక్రవర్తి, డైరెక్టర్ మాన్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తింపు రద్దు చేయాలి

నిజామాబాద్‌అర్బన్: బోధన్‌లోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఇంటర్ అధికారి రఘురాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. విజయ సాయి, షిర్డీ సాయి జూనియర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు మంచి సందేశం ఇవ్వాల్సిన కరస్పాండెంట్ సుబ్బారావు వికృత చేష్టలతో డ్యాన్సులు చేస్తూ విద్యార్థులను తప్పుడు దారి పట్టించారని వారు ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు చెడుగా మెసేజ్ ఇస్తూ తప్పుదోవ పట్టిస్తున్న విజయసాయి, షిరిడి సాయి జూనియర్ కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఆర్థిక సహాయం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని గాజులపేట్‌లో కిరాయి ఇంట్లో నివాసం ఉంటూ మంగళి పని చేసుకునే గాజులవారి ఆనంద్ కుమారుడు దీక్షిత్‌కు కళ్లు సరిగా కనపడటం లేదు. దానికి తోడు నరాల వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. చెన్నైలో చికిత్స చేయించుకుంటాం.. దారి ఖర్చులు, మందులకు సహాయం చేయాలని శ్రీలక్ష్మీచేయూత సమితిని సంప్రదించగా వెంటనే మంగళవారం సమితి సభ్యులు ఆనంద్‌కు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆర్మూర్‌కు చెందిన బాస జమున కుటుంబానికి కూడా రూ.పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. సమితి అధ్యక్షులు వంగల రమణాచారి, లక్ష్మణ్, శ్యామ్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



తెయూ(డిచ్‌పల్లి): సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధి కోసం అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేయాలని రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌యూఐ నాయకులు కోరారు. మంగళవారం బల్మూరి వెంకట్‌ను తెయూ ఎన్‌ఎస్‌యూ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నాళ్లీ దుస్థితి

- 8 నెలల క్రితం నిలిచిన అభివృద్ధి పనులు
- ఒకే భవనంలో 320 మంది విద్యార్థులకు తరగతులు
- ఇదీ ఎల్లమ్మగుట్ట పాఠశాల పరిస్థితి



రేకులు తొలగించడంతో మొండి గోడలతో మిగిలిన ఉన్నత పాఠశాల భవనం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఎల్లమ్మ గుట్ట ప్రభుత్వ పాఠశాల పరిస్థితి అధ్వానంగా మారింది. మన బస్తీ- మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలను అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా పాఠశాలలో పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేయడంతో 320 మంది విద్యార్థులు అరకొర తరగతి గదులతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు సైతం ఇక్కడ అదనపు తరగతులు, సక్రమమైన విద్యా బోధన లేక అవస్థలు పడుతున్నారు. మన బస్తీ- మన బడి కార్యక్రమంలో భాగంగా ఎల్లమ్మ గుట్టలోని ప్రభుత్వ పాఠశాలకు రూ.72.68 లక్షలను కేటాయించారు. మొదటి విడతలోనే ఈ పాఠశాల అభివృద్ధికి ఈ నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా పాత భవనానికి సంబంధించి రేకులను పూర్తిగా తొలగించి పిల్లర్లు వేసి దానిని స్లాబ్‌గా మార్చడం, రెండు అదనపు గదులు, డైనింగ్ హాలు నిర్మించాలని నిర్ణయించారు. సంబంధిత కాంట్రాక్టర్ గత ఏడాది జూన్‌లో పనులు ప్రారంభించారు. పక్కనే ఉన్న ప్రైమరీ పాఠశాలలో తరగతులను నిర్వహిస్తున్నారు. దీని వల్ల ఒకే భవనంలో 320 మంది పిల్లలు విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉదయం ప్రైమరీ పాఠశాల.. మధ్యాహ్నం హైస్కూల్

హైస్కూల్‌కు సంబంధించి 120 మంది, ప్రైమరీ పాఠశాలలకు సంబంధించి 200 మంది విద్యార్థులు ఉన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రైమరీ మధ్యాహ్నం రెండున్నర నుంచి నాలుగు గంటల వరకు హైస్కూల్ విద్యార్థులకు విద్య బోధన కొనసాగుతోంది. ఒకే భవనంలో ఇంత మంది విద్యార్థులకు బోధన చెయ్యడం ఇబ్బందికరంగా మారింది. సరైన తరగతి గదులు లేక పాఠశాల ఆవరణలో విద్యార్థులను కింద కూర్చోబెడుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం కూడా సక్రమంగా అందించడం లేదు. ప్రస్తుతం పాఠశాలలో అభివృద్ధి పనుల్లో భాగంగా పాత భవనానికి సంబంధించి రేకులను పూర్తిగా తొలగించారు. గోడలు మాత్రమే ఉన్నాయి. డైనింగ్ హాల్ గోడల వరకు నిర్మించి వదిలేశారు. పనులు 20 శాతం మాత్రమే జరిగాయి. నిధులు లేవని కాంట్రాక్టర్ గత ఏడాది ఆగస్టులో పనులను నిలిపివేశారు. ఇప్పటివరకు పనులు మళ్లీ ప్రారంభం కాలేదు. ఉన్న భవనం అందుబాటులో లేకపోవడంతో పక్కనే భవనంలో విద్యార్థులంతా ఒకే చోట ఉండడంతో కిక్కిరిసిపోతున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతుల బోధన, టెస్టుల నిర్వహణ జరగడం లేదు. ఎండాకాలం ప్రారంభం కావడంతో విద్యార్థులకు మరింత సమస్య ఎదురు కానున్నది. డబ్బులు ఇస్తే గాని పనులు మొదలు పెట్టనని కాంట్రాక్టర్ మొండికేయడంతో ఉన్న భవనం పోయి విద్యార్థులు టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారు.జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి పనులను త్వరగా పూర్తి చేయించాలని వేడుకుంటున్నారు.



మధ్యలోనే నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణ పనులు

పనులు త్వరగా పూర్తి చేస్తే మేలు



భవనం పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుకుంటున్నాం. అందరు విద్యార్థులు ఒకేచోట ఉండడం వల్ల ఇబ్బంది అవుతోంది. త్వరగా పనులు పూర్తి చేసి భవనాన్ని అందించాలని కోరుతున్నాం.

– శంకర్, పాఠశాల హెచ్‌ఎం

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

డిచ్‌పల్లి: నేటి నుంచి డిచ్‌పల్లి పరిధిలో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్, ఎస్‌పీఆర్ కాలేజ్, తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్/కాలేజ్, ధర్మారం(బి) గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు జరుగనున్నాయి. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు అనుమతి ఉండదని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అములులో ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, వాటిపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని తెలిపారు.



డిచ్‌పల్లి టీఎస్ మోడల్ జూనియర్ కాలేజ్‌లో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

ధర్పల్లి: ఇంటర్ విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సమయానికి ముందే చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని ఇంటర్ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ బాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లను మంగళవారం అధికారులు పూర్తి చేశారు. ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 408, ద్వితీయ సంవత్సరం 444 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాబోతున్నారని తెలిపారు.

హాల్ టికెట్లు ఇవ్వని కళాశాలపై చర్యలు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని ప్రయివేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్‌ఐ(భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్) ఉమ్మడి జిల్లా కార్యదర్శి సంజయ్ తలారే డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఇంటర్ అధికారి రఘురాజ్‌కు వినతి పత్రం ఇచ్చారు. చర్యలు తీసుకోకపోతే ధర్నాలు, ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సైన్స్ పాత్ర ప్రధానం

సిరికొండ: వినూత్న ఆలోచనలను రేకెత్తించడంలో సైన్స్ పాత్ర ప్రధానమని ఎస్సై జి. రమేశ్ పేర్కొన్నారు. సత్యశోధక్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రీయ విజ్ఞాన ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలను, ప్రదర్శనను ఎస్సై తిలకించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'శానిటేషన్'లో ఇదేమి లొల్లి

- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రజాప్రతినిధులపై ఒత్తిడి
- మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా తీర్మానం కోసం పట్టు

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ, మున్సిపల్ నిబంధనలు ఏదైనా సరే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలంటే ప్రభుత్వం నుంచే ఆదేశాలు రావాలి. అయితే శానిటేషన్ విభాగంలోని ఆయా జోన్ల పరిధిలో ముఖ్యమైన పోస్టుల్లో ఉండే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయించాలని ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లారు. మున్సిపల్ బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేయించాలని పెద్ద ఎత్తున ముడుపులు ఇచ్చి మరీ ఒత్తిడి తెచ్చారని జోరుగా చర్చ జరుగుతుంది.

ఇదీ పరిస్థితి..

నిజామాబాద్ నగరంలో శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, మెప్మా తదితర సెక్షన్‌లలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో వందలాది మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఏళ్ల తరబడిగా ఆయా విభాగాల్లో పనులు చేస్తున్నారు. కొంత మంది కంప్యూటర్ ఆపరేటర్లుగా, మరికొంత ఆఫీస్ అటెండర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఎవరికి రాని ఆలోచన శానిటేషన్ విభాగంలో ఆయా జోన్‌లో కీలకంగా విధులు నిర్వహించే ఉద్యోగులకు వచ్చింది. ఈ ఆలోచనతో నేరుగా ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన కార్పొరేటర్ల వద్దకు వెళ్లి రెగ్యులర్ కోసం తీర్మానం చేయించాలని వేడుకున్నారు. దీనికోసం పెద్ద ఎత్తున ముడుపులు సైతం అందించారని సమాచారం. ముఖ్యమైన పోస్టుల్లో కొనసాగుతున్న ముగ్గురు, నలుగురు ఉద్యోగులు రెగ్యులర్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జోన్ పరిధిలో ప్రతినెలా కమీషన్లు వస్తున్నాయని, అందులో నుంచి పెద్ద ఎత్తున ముడుపులు అందించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందరి గురించి కాకుండా కేవలం వీరి కోసం రెగ్యులర్ చేయించాలని మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఈ సమస్య లేవనెత్తారు. ఉద్యోగులను రెగ్యులర్ చేసే అధికారం మున్సిపల్ జనరల్ బాడీ సమావేశానికి లేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

శానిటేషన్‌పై ఇప్పటికే మచ్చ..

శానిటేషన్ డిపార్టుమెంటుపై ఇప్పటికే మచ్చ ఉంది. ఇష్టారాజ్యంగా డీజిల్ వాడకం జరుగుతూనే ఉంది. దీంతో పాటు కార్మికులు గైర్హాజరవుతున్నా హాజరు వేస్తున్నారని, బదిలీ వర్కర్లతో పనులు చేయిస్తూ కొంతమంది జోన్‌లకు సంబంధించి ఉద్యోగులు కమీషన్‌లు అందుకుంటున్న విషయం మున్సిపల్ కమిషనర్ దృష్టికి వచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే డీజిల్ వాడకంపై విచారణ చేయించారు. శానిటేషన్‌ను చక్కదిద్దడానికి కమిషనర్ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిసింది.

చేవెళ్ల సభకు తరలిన మహిళలు

డిచ్‌పల్లి/నిజామాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అభయహస్తం ఆరు గ్యారంటీల్లో మరో రెండు గ్యారంటీల అమలుకు మంగళవారం శ్రీకారం చుట్టింది. దీనికోసం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో భారీ సభను ఏర్పాటు చేసింది. ఈ సభలో పాల్గొనేందుకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఒక్కో మండలం నుంచి 50 మంది మహిళా సంఘాల సభ్యు లు తరలివెళ్లారు. ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా ప్రభుత్వం, మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచిత కరెంట్‌ను ప్రారంభించింది. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, తదితరులు, మహిళా సంఘాల సభ్యులను చేవెళ్ల సభకు సాగనంపారు.



విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దు

నిజామాబాద్‌నాగారం: అనవసరంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగించినా, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నా వేటు తప్పదని విద్యుత్ శాఖ నిజామాబాద్ డివిజన్ డీఈ శ్రీనివాస్‌రావు విద్యుత్ ఉద్యోగులను హెచ్చరించారు. మంగళవారం నగరంలోని కార్యాలయంలో డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 కేవీ ఫీడర్స్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌పార్మర్స్ సరి చేసుకోవాలన్నారు. పంట పొలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి గృహ జ్యోతి పథకం గురించి కూడా సవివరంగా వివరించాలన్నారు. ఏడీఈ లు చంద్రశేఖర్, తోట రాజశేఖర్, వీరేశం, ఎం అశోక్, సుహాసిని, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవం



నివాళులర్పిస్తున్న తెయూ ఏబీవీపీ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఏబీవీపీ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అమరవీరులను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు శివ మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఏబీవీపీ కార్యకర్తలను అతి కిరాతకంగా హత్యలు చేసినా బెదరకుండా పోరాడుతూ జాతీయతనే ఊపిరిగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నరహంతక నక్సల్ రాడికల్స్ చేతిలో దేశం కోసం ప్రాణాలర్పించిన 40 మంది విద్యార్థి పరిషత్ కార్యకర్తలకు ఘనంగా నివాళులర్పించినట్లు తెలిపారు. తెయూ ఏబీవీపీ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, అమృత్‌చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, నాయకులు తరుణ్, హరికృష్ణ, సమీర్, మణి, అక్షయ్, సచిన్, ప్రమోద్, సతీష్ పాల్గొన్నారు.

'నిధి ఆప్కే నికట్' ను సద్వినియోగం చేసుకోవాలి

నిజామాబాద్ రూరల్: గుండారం, శ్రీనగర్ గ్రామాల్లో మంగళవారం నిధి ఆప్కే నికట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీ సంయుక్తంగా చందాదారులు, పెన్షనర్ల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు రాఘవేందర్, మాల్యాద్రి తక్షణమే పరిష్కరించారు. ప్రతి నెల 27న ఈ 'నిధి ఆప్కే నికత్ 2.0' కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించే వేదికను ముందుగానే తెలియజేస్తామన్నారు.

దేవాదాయ సిబ్బందికి ప్రశంసా పత్రాలు

నిజామాబాద్ సిటీ: సమ్మక్క సారలమ్మ జాతరలో విధులు నిర్వహించిన నిజామాబాద్ దేవాదాయ, ధర్మదాయ శాఖ సిబ్బందికి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ప్రశంసా పత్రాలను అందజేశారు. నగరంలోని సాయిబాబా ఆలయం జూనియర్ అసిస్టెంట్ కొండుకా గంగాధర్, అటెండర్ సోమయ్యలు 10 రోజుల పాటు సమ్మక్క సారలమ్మ జాతరలో అత్యుత్తమ సేవలందించగా వీరికి ప్రశంసా పత్రాలను ఇచ్చారు.

నేటి చిత్రం..



పాత మున్సిపల్ కార్యాలయంలో వాడకుండా ఉన్న వాటర్ ట్యాంకర్లు

లక్షలు ఖర్చుపెట్టారు.. మూలన పడేశారు

నుడా పరిధిలో మున్సిపల్ అవసరాల నిమిత్తం గత సంవత్సరం రూ.లక్షలు వెచ్చించి వాటర్ ట్యాంకర్లను కొనుగోలు చేశారు. కానీ వినియోగించకుండా పాత మున్సిపల్ కార్యాలయంలో మూలన పెట్టారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో నుడా పరిధిలో డివైడర్ల మధ్య మొక్కలు ఎండిపోకుండా ఉండడానికి వీటిని వాడకంలోకి తీసుకురావాలని నగర ప్రజలు కోరుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

మేధో సంపత్తి హక్కులు ఆర్థికాభివృద్ధికి మూలం



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ జీబీ రెడ్డి.. పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): మేధో సంపత్తి హక్కులు ఆర్థిక అభివృద్ధికి మూలధాతువులని, అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి గ్రోత్ ఇంజిన్‌గా పని చేస్తాయని ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో కామర్స్ సెమినార్ హాల్‌లో మంగళవారం 'మేధో సంపత్తి హక్కులు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మేధో సంపత్తి సృష్టించడంలో యూనివర్సిటీ అధ్యాపకులు నిర్మాణాత్మక పాత్ర వహించాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథి రాజారాం మాట్లాడుతూ.. భారత దేశ అభివృద్ధిలో యూనివర్సిటీల పాత్ర ఎంతగానో ఉందన్నారు. తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి, అధ్యాపకులు వాసం చంద్రశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మొదలైన మహా కుంభాభిషేకం



వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ సిటీ: నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం(కిషన్‌గంజ్)లో మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరుకాగా, ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పాల్తి రవికుమార్ గుప్తా, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

భక్త మార్కండేయ మహోత్సవం

నిజామాబాద్ సిటీ: నగరంలోని కోటగల్లి మార్కండేయ మందిరంలో భక్త మార్కండేయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శతాధిక ప్రతిష్ఠాపనాచార్యులు చౌటపల్లి గంగాప్రసాద్ దీక్షితులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, నగర పద్మశాలి సంఘం బాధ్యులు గంట్యాల వెంకట్ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు

నిజామాబాద్ రూరల్: మల్కాపూర్(ఎ) లక్ష్మాపూర్ గ్రామ శివారుల్లో ఉన్న అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయల ప్రధాన అర్చకుడు మాక్కురి రమణచారి సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

జక్రాన్‌పల్లి: అర్గుల్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి పల్లకిని హనుమాన్ ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం స్వామి కల్యాణం జరిపించారు. మాజీ సర్పంచ్ గోర్త పద్మ, మాజీ ఉపసర్పంచ్ గోర్త రాజేందర్, వీడీసీ చైర్మన్ రాజారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,050	వెండి (కిలో)	73,900
22 క్యారెట్స్	59,060	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	70	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	50	70	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	45	65	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	35	60	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సుందరం మాస్టర్ (తెలుగు) - 11.15, 10.30 భ్రమయుగం (తెలుగు) - 1.50, 7.40 ఈగల్ (తెలుగు) - 4.40
స్క్రీన్-2	ఆర్టికల్ 370 (హిందీ) - 10.40, 4.30 ఊరుపేరు భైరవ కోన (తెలుగు) - 1.45, 10.30, హనుమాన్ (తెలుగు) - 7.30
స్క్రీన్-3	ఆర్టికల్ 370 (హిందీ) - 1.30, 10.30 హనుమాన్ (తెలుగు) - 4.35, సుందరం మాస్టర్ (తెలుగు) - 7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆర్టికల్-370 (హిందీ) - 1.00, 7.10, 10.35, సుందరం మాస్టర్ (తెలుగు) - 4.25
స్క్రీన్-2	సిద్ధార్థరాయ్ (తెలుగు) - 1.30, భ్రమయుగం (తెలుగు) 4.40, 10.40, ఊరి పేరు భైరవకోన (తెలుగు)-7.40
స్క్రీన్-3	క్రాక్ జీతేగా తో జీయేగా (హిందీ) - 10.05, 6.35, 9.55, తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి - 1.25, ఊరి పేరు భైరవకోన (తెలుగు) 3.35
స్క్రీన్ -4	ముఖ్యగమనిక (తెలుగు) - 1.05, మస్తు షేడ్స్ ఉన్నయ్‌రా 3.50, హనుమాన్ (తెలుగు) - 6.50, సుందరం మాస్టర్ (తెలుగు) 10.10
దేవి	హనుమాన్ (తెలుగు)
నటరాజ్	క్రాక్ జీతేగా తో జీయేగా (హిందీ)
లలితామహల్	భ్రమయుగం (తెలుగు)
విజయ్	ఊరు పేరు భైరవకోన (తెలుగు)